


# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఆగస్ట్ 2014

సంపుటి : 20 (235) సంచిక : 8




# దేఁవుడెకడో కొండ కోనలందు లేడు! జగమంతటా ఉన్నాడు! జన మన మందిరంలో ఉన్నాడు!!

**జ**య నామ సంవత్సరం ఎంతటి అపజయం కొని తెస్తుందోనని అహరహమూ బాధపడ్డాను. భారతీయం కోసం పరితపించే హృదయాలన్నీ కమిలి కుమిలి పోయాయి. విజయనామ సంవత్సరమంతా రోదనా ఆవేదనలు నింపివేసింది. ఒక్కసారి జాతీయ హృదయం కల మహాకవి గురజాడవారి చిత్రం వంక చూసాను. అయిదు లిప్త మాత్రముల కాలం ప్రశాన్తతను కల్గించింది. అందరూ నాయకులూ, నాయకాభిమానులూ ఏడుకొండలవాణ్ణి దర్శించుకుంటున్నారు. అంతరాలయంలో ఉద్యోగులు పదపద– అని పట్టినెట్టేసేస్తున్నప్పటికినీ, పదపద నీకాపద రానీయనని ఆ స్వామి భరోసా యిచ్చినట్లనిపించే దర్శనానికి వెళ్ళే శక్తి లేకపోయిందేనని అంతర్మదనం చెందాను.

భారతీయ పునరావిర్భావం కావాలనే అంతర్భావనే తక్క, నా నిమిత్తం వెళ్ళాలని కాంక్షించలేదు. ఎందుకో తపనా, దేవదేఁవుని చూడాలనే దేఁవులాట దేహాన్ని దేవేసింది. 82 సం॥ముల **ముదర సీనియర్ సిటిజనే** గాకుండా తెలుగుభాషకు 62 సంవత్సరములుగా సేవ చేస్తున్నవాడిని! సనాతన ధర్మసేవాతత్పురునికి ఆ అవకాశం కలుగలేదే–యని బాధపడ్డాను.

పిదప **దేఁవుడెకడో కొండకోనల–**
**దాగెనంటూ చూస్తవేల?**
**కన్ను విప్పిన కానపడడో–**
**కలిగి యీడో ముక్తి నతడూ!**

– అన్న గురజాడ అప్పారావుగారి ముత్యాలసరము నా కళ్ళముందు వేంకట రమణుని ఏడువారాల రత్నాలహారములా కనిపించింది. సమాధానపడ్డాను.

తెలుగువారి ప్రత్యేక రాష్ట్రపోరాట గరిమ – తెలుగువారి ఓరిమి – తెలుగు కలిమిబలిమిలను కేంద్రంలోని ఓ కుటుంబ పాలన చెరిపివేసిందన్న బాధ తొలగి మోడీ ప్రభుత్వం వచ్చిందనే సంతోషం కలిగింది.

అయితే దేశపాలనను సమర్థంగా చేసి, ఆర్థికమాంద్యాన్ని రూపుమాపి ప్రపంచ దేశాల్లో భారత్‌కో ప్రత్యేక విలువను సంతరింపచేసిన తెలుగు ప్రధాని పి.వి. నరసింహారావును అష్టకష్టాలకు గురిచేయడం, ఆయన పార్థివదేహానికి నివాళులర్పించవలసినదిపోయి, ఢిల్లీలో ఆయనకో స్మారక చిహ్నమునకు సెంటు నేల లేకుండా చేసినవారికి దాసోహమన్న ఆంధ్రనాయకుల్ని చూచి బాధ జాలిపడ్డాను. దాసోహం కౌసలేంద్రస్య– అన్నా ఫరవాలేదు. కానీ తెలుగులకు అన్యాయం చేస్తున్నవారి పాదాలను మ్రొక్కుతున్నాం. బ్రిటిషువారు వెళ్ళిపోయాక కూడా దాస్యభావం పోలేదన్న విచారం కూడా కలిగింది. అసలు మనలో తెలుగుదనం లోపించిందా? తెలుగులకు పౌరుషం లేదా!

**చేయెత్తి జైకొట్టు తెలుగోడా గతమెంతో ఘనకీర్తి కలవోడా**
**వీరరక్తపు ధార వారవోసిన సీమ**
**వెలనాడు నీదెరా పలనాడు నీదెరా!**

–అన్న నార్ల చిరంజీవి సమభావం 'సము'ఖ్యత ఎపుడు వస్తుందో, ఎలా వస్తుందో కాలమే చెప్పాలని నిట్టూర్చాను.

**ఒక్కనాటి ప్రపంచం ఒక్కనాటి వలెకాదు; ఒక్క నిమిషమువలె నొకటికాదు–** అన్న అన్నమాచార్యుని కీర్తనం పల్లవించి మనసును కుదుటపరచక తప్పడం లేదు.

మొదలూ చివరా తెలియని నదీ గర్భాన్ని చీల్చుకుని ఊపిరిపోసుకుంటున్న మనం అనంతకాల వాహిని విస్తీర్ణతను చెప్పలేము. కుదించుకునిపోతున్నదని కుమిలిపోనూ లేము. అనంత కాలమా! నీవే చెప్పు!

ఆగష్టు 15కు స్వాతంత్ర్యం వచ్చి 67 సం॥ములు పూర్తయింది. ఏఁవి సాధించామని గుప్పెటను విప్పి చూసుకుంటే ఏఁవీ లేదు. భారతీయతను చాటే మోడీ ప్రభుత్వం కేంద్రంలోనూ, చంద్రబాబు, చంద్రశేఖరరావుల ప్రభుత్వాలు సీమాంధ్ర, తెలంగాణాలోనూ అభివృద్ధిపథంలో ప్రగతి సాధిస్తాయని ఆశిద్దాం.



**స్వస్తి! సన్మంగాళిని భవన్తు!**

బుధజన విధేయుడు

*– గోటేటి శ్రీరామారావు*


**స్వీయ నిర్దేశం ద్వారా స్వీయోన్నతి తెలియచేసినది శ్రీకృష్ణుడే!**
**పాకే వయసు నుంచీ, పిల్లనగ్రోవి పట్టేవరకూ, అక్కణ్ణుంచీ గీతాబోధన వరకూ అవతార పర్యంతమూ – ఆయన లీలలు అనుపమానములు.**
**ఏకం శాస్త్రం దేవకీ పుత్రగీతం – ఏకోదేనో దేవకీ పుత్ర ఏవ!**
**సమస్త విశ్వానికీ ఆయన 'భగవద్గీత'యే అత్యుత్తమ గ్రంథం!**
**సమస్త ప్రపంచానికీ దేవకీ పుత్రుడే దేఁవుడని ఋజూపరిచినది శ్రీకృష్ణుడే!**
**ఆయన జగత్కారణ ప్రభువు; జగద్గురువూ ఆయనే!**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**




ఒకటా, రెండా, మూడా, నాలుగా - ఒక్కొక్క మెట్టునే
అధిరోహిస్తూ 20 సం॥ముల 6 మాసాలను
అధిరోహించాం! ఐదు ఖండాల్లోని
తెలుగువారికీ చేరువయ్యాం!
ఇది ఒక్కనాటి ప్రయాణం కాదు!
ఒక్కడి ప్రయాణం! యుక్తవయస్సు ప్రయాణమా?
అరవై సంవత్సరాలు నిండిన
తరువాత చేసిన ప్రయాణం!
ఉచిత పంపిణీ పత్రికగా చేసిన సాహసం!
అడిగినపుడు కొందరూ! అడగకుండా కొందరూ
ప్రకటన లిచ్చి ఆదుకున్నారు. జ్ఞాపకం చేసుకుంటూ
కొందరు వార్షిక సభ్యత్వమంటూ పంపారు.
అయినా 80 శాతం పత్రికలు ఉచితంగా పంపే
వ్యయాన్ని భరించవలసి వస్తుంది.
82 సం॥ముల వయసు భారాన్ని ఒరిసిపోకుండా
ఆ 20 శాతము మంది అభిమాన దేవుల, స్వచ్ఛంద
సహకారమూ నన్ను ఒడిసిపట్టుకుంటూంది.
వేంకటరమణా! నీవెంతటి సంకట హరుడవయ్యా!
సహస్రశీర్షుడవంటారు. సహస్రపాదుడ వంటారు.
నా కందినవి రెండు పాదములేనయ్యా! అవి రెండే
నను కందిపోనీకుండా చేస్తున్నాయ్! 'ప్రముఖాంధ్ర'
పఠిత సార్వభౌముల్ని ప్రవర్ధింపచేస్తూ, వారి
వాత్సల్యానుగ్రహ కరుణను సదా ప్రసరించేసేట్టు
అనుగ్రహించు తండ్రీ!

బుధజన విధేయుడు
**గోటేటి శ్రీరామారావు**




# పోలవరపు తులసీదేవి సుగుణాల ప్రోలు!

## న్యూయార్కులో ప్రసిద్ధిగన్న మహిళా శిశు చికిత్సా నిపుణురాలు!!



**ఆ** విశాల పాలమును చూడండి! అమాయకతకు చిరునామా, ఆత్మీయతకు ఆ నేత్రములచిరునామా! ఆ నవ్వులోని పలువరుస మధ్య చిన్నగా చీలిన చందమును చూడండి! ఆప్యాయతా – ఆత్మీయతలు తనవేనని – మాతృదేశమూ– తానుండే అమెరికా దేశంలోని మాతా శిశువుల ఆరోగ్యాభ్యున్నతికి తాను ప్రతిన బూనిన ద్విచికిత్సా సంకేతం! ఆ బొట్టు నేన్నది చేస్తాననే ఒట్టు..

**డా॥ తులసీదేవి సేవాశీల ప్రోలతనం అనిర్వచనీయం:**

**ఆమె అమెరికాలోని 'తానా' సంఘ కార్యనిర్వాహక సభ్యురాలు. 'ఆటా' వారు న్యూజెర్సీలో తమ ద్వైవార్షికి మహాసభలను జరుపవలసి వచ్చింది. వారు డా॥ పోలవరపు తులసీదేవిని ఓ శాఖా అధ్యక్ష పదవిని చేబట్టమన్నప్పుడు ఆమె అంగీకరించి, సమర్ధంగా నిర్వహించింది. 'సప్తగిరి' సంపాదకుడు శైలకుమార్ వచ్చినపుడు– ముందు తన యింట్లోనే వసతి కల్పించి తరువాత స్టార్ హోటల్‌లో వసతి నేర్పరచిన అతిథి గౌరవపు గుణశీలి పోలవరపు తులసీదేవి.**

**అనురాగమే తప్ప ఆడంబరం లేదు. అణకువేగాని అతిశయం లేదు.** ఆశయానికి తగ్గ ఆచరణ. పొగడ్తల కొగ్గని నిగ్గుతనం. నిరుపమాన గుణం అపురూపమనం. సేవాభావములు ప్రోలు డా॥ పోలవరపు తులసీదేవి!

ఆమెకు జ్ఞాపకం ఉందో, లేదోకానీ న్యూయార్కులో ఇండో అమెరికన్ కాన్సర్ ఆర్గనైజేషన్ సమావేశంలో బసవరామతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి ప్రస్తాపనంగా వైద్యుల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో డా॥ కోడెల శివప్రసాదరావు (ప్రస్తుత ఆంధ్రా శాసనా సభ అధ్యక్షులు) కూడా పాల్గొన్నారు. నా హితైషులు కిడాంబి రఘునాథ్ నన్ను ఆ సమావేశానికి తీసుకుని వెళ్లారు. అప్పుడే డా॥ పోలవరపు తులసీదేవిగారిని కలుసుకున్నాను. అనేకమంది ప్రసిద్ధ డాక్టర్లతో కలుసుకున్న సమావేశం. ఆ ప్రదేశం న్యూయార్కు అంతర్భాగమైన లాంగ్ ఐలాండ్ అనుకుంటాను.

(తరువాయి 6వ పేజీలో)

# సహకారం అందిస్తాం - మహిళా శిశు వైద్యశాల, వైద్యకళాశాలకు యత్నం చేయండి

ప్రస్తుతం హైదరాబాద్‌లోని బసవతారంకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రికి వస్తున్న వ్యాధిగ్రస్థుల్లో 60 శాతం మంది కోస్తా... రాయలసీమ ప్రాంతాలకు చెందినవారే. మహిళా – శిశు మరణాలు తగ్గించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రమాణాలతో భారీ వైద్యశాల, వైద్య – ఫార్మశీ – దంత వైద్యశాలలు నెలకొల్పేందుకు వ్యక్తిగతంగా ప్రయత్నిస్తున్నా అని ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆర్గనైజేషన్ చేర్ పర్సన్ పోలవరపు తులసీదేవి అన్నారు. డాక్టర్ పోలవరపు తులసీదేవి బసవతారకం ఆసుపత్రి, పరిశోధనా సంస్థ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు అమెరికా నుంచి వచ్చి తన భవిష్యత్తు ప్రణాళిక విశదపరిచారు.

క్యాన్సర్ చికిత్సకు గతంలో చెన్నై (అడయార్)కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో, చికిత్సకు అవసరమైన అన్ని అత్యాధునికి పరికరాలున్నాయి. వెంట్రుకవాసి కణుతుల చికిత్స కోసం లీనియర్ యాక్సెలరేటర్ పరికరాలు 6 ఉన్నాయి. బ్లడ్ బ్యాంక్ పరికరాలన్నీ జర్మనీవి. అమెరికాలోని 23 మంది వైద్యులం కలిసి సభ్యులుగా ఉన్న ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆర్గనైజేషన్ పరికరాలకు ఆర్థిక సాయం చేస్తుంటే, దేశీయంగా బసవతారకం ట్రస్టు తక్కువ ఖర్చుతో ఆసుపత్రి నిర్వహిస్తోంది. ఆరోగ్యశ్రీ వంటి పథకాల లబ్ధిదారులకు ఈ ఆసుపత్రిలో సేవలు అందిస్తూ, లాభాపేక్ష రహితంగా నిర్వహిస్తున్నాం. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి, సత్వరం చికిత్స అందిస్తే వ్యాధిగ్రస్థులు బతికే అవకాశాలు అధికం. ఇందుకోసమే మెమోగ్రామ్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించే మొబైల్ వ్యానును నిర్వహిస్తున్నాం. ప్రతినెలా 7–8 ప్రాంతాల్లో సేవలు అందిస్తూ గుర్తించిన వారికి ఆసుపత్రికి రిఫర్ చేస్తూన్నాం. ఇటీవలే రూ. 16.50 కోట్ల వరకు అందించాం. వ్యాధి తీవ్రత దృష్ట్యానే ఆంధ్రప్రదేశ్‌లోనూ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తామని బసవతారకం ట్రస్ట్ చేర్మన్ బాలకృష్ణ ప్రకటించారు. అందరికీ అందుబాటులో ఉండేలా నూతన రాజధానిలో అయితే బాగుంటుందని మా ఉద్దేశం. నిర్దిష్ట ప్రతిపాదనలు సిద్ధం అయ్యాక, మా వంతు సహకారం అందిస్తాం. ఇతర ఆసుపత్రులకు భిన్నంగా క్యాన్సర్ ఆసుపత్రుల్లో పరికరాలకు అధికపెట్టుబడి కావాలి. రూ 30 కోట్లతో భవనం నిర్మిస్తే రూ 40 కోట్లు పరికరాలకు అవుతుంది. క్యాన్సర్ చికిత్సా పరికరాలను ఎప్పటికప్పుడు ఆధునికీరించడంతోపాటు సమర్థ నిర్వహణకూ నిధులు వెచ్చించాల్సి వుంటుంది. అధిక అంతస్థుల భవనం అయితే 5 ఎకరాలు, లేకుంటే 10 ఎకరాల స్థలం కావాల్సి ఉంటుంది. నీరు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలతో పాటు వైద్యసిబ్బంది నివాస సముదాయాలు కూడా ఉండాలి. బసవతారకం ఆసుపత్రి సమయంలో క్యాన్సర్ చికిత్సకు అవసరమైన వైద్యుల లభ్యత తక్కువ. ఇప్పుడా సిబ్బంది ఇబ్బంది లేదు. నేను వ్యక్తిగతంగా గైనకాలజిస్టు. మహిళా శిశు మరణాలు తగ్గించేందుకు డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలతో ప్రత్యేక ఆసుపత్రిని ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించాలన్నది నా లక్ష్యం. అధునాతనమైన వైద్యసదుపాయాలు తక్కువగా ఉన్న ప్రాంతంలో అయితే నిరుపేదలకు సేవలు అందుతాయని భావిస్తున్నా. దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వం ఈ తరహాలో నిర్వహిస్తున్నాయి. ప్రతివారం డాక్టర్ తన బృందంతో గ్రామాలకు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు. అవసరం అయిన వారిని ఆసుపత్రికి తీసుకువస్తారు. మహిళల ఆరోగ్యం, శిశువులకు వ్యాధి నిరోధక కార్యక్రమాల వంటివి అమలు చేయాలి. ఆ ప్రాంతంలోనే ఎంసీఐ ప్రమాణాలకు అనుగుణంగా మహిళలకోసమే ప్రత్యేకంగా వైద్య, దంత, ఫార్మశీ వైద్య కళాశాలలను నేను, మరికొంతమంది సొసైటీగా ఏర్పడి స్థాపించాలని ఉంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిపాదన అందించాం.. ఆయన సానుకూలంగా స్పందించారు.

# ఎంతటి కర్కశ హృదయవే తల్లీ! ఆడతనానికి, అమ్మతనానికీ 'మచ్చ' తెచ్చావు కదమ్మా!



ముగ్గురమ్మల మూలపుటమ్మగా 'అమ్మ'ను కీర్తించిన బమ్మెరపోతన గడ్డపై పుట్టిన మోహనమ్మా! 13 రోజుల ఆడశిశువునెంత కర్కశంగా చంపావమ్మా! నీటి సంపులో పడేసి చంపావా? మా అమ్మ అలి మేలు మంగమ్మయినా ఆ ఆడ శిశువు మరణాన్ని అడ్డుకోలేదా. జలధిని గంగమ్మ అంటారే ఆ గంగమ్మ తిరుపతిలోనే ఉన్నది. ఆఁవిడెలా అంగీకరించిందమ్మా!

నీవు ఆడబిడ్డవే! నీకు జన్మనిచ్చినది కూడా ఓ ఆడబిడ్డే! నీ మగణ్ణి కన్నది కూడా ఆడబిడ్డే ఆ బిడ్డ నీలాంటి బిడ్డకో జన్మనిచ్చేది కదా తల్లీ! నీ మొగుణ్ణిలాఁటి ఓ మొగుణ్ణి కనేది! ఈ సృష్టి క్రమాన్ని అడ్డుకోవాలని చంపావా? ఆ పసికందు నీలా పెరిగి ఓ అయ్యను పెండ్లాడలేదని చంపావా?

ఈ ఘోరం తిరుపతి రూరల్ మండలంలోని పెరుమాళ్లపల్లిలో చోటుచేసుకుంది. టీటీడీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఈశ్వరరెడ్డి – మోహనల మొదటి సంతానం ఆడబిడ్డ. 13 రోజుల క్రితం మోహనకు రెండో సంతానంగా మళ్లీ ఆడబిడ్డ పుట్టింది. ఇద్దరూ ఆడబిడ్డలు పుట్టడంతో బంధువుల సూటిపోటి మాటలతో మోహన తీవ్రమనస్తాపం చెందిందని, ఆడబిడ్డపుట్టిన విషయమై ఇంట్లో చర్చ జరిగిందని సమాచారం. దీంతో తెల్లవారుజామున మోహన బిడ్డను నీటి సంపులో పడేసింది. మిస్సింగ్ కేసు పెట్టాలని ముందే వేసుకున్న ప్రణాళిక ప్రకారం తెల్లవారేసరికి పక్కలో బిడ్డ కనిపించడం లేదని ఉదయం మోహన ఏడవడం మొదలుపెట్టింది. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతలోనే పాప సంప్‌లో శవమై తేలినట్లు సమాచారం. పాప పక్కలోనే ఉందని కాసేపు, పాక్కుంటూ వెళ్లి ఉంటుందని మరికొద్దిసేపు తల్లి మోహన పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసుల అనుమానాలు బలపడ్డాయి. తమదైన శైలిలో విచారించడంతో మోహన తానే పాపను సంప్‌లో వేశానని ఒప్పుకుంది. రెండో బిడ్డ కూడా ఆడపిల్లే పుట్టడంతో మానసిక వేదనకు గురయ్యా. ఆ స్థితిలోనే బిడ్డను సంప్‌లో వేశాను అన్నది. ఎంతటి ఘోరం!

## భగవంతుడా!

**ఓ ప్రక్క శిశుహంతకులు! మరో ప్రక్క లేత మొగ్గదశలోనే చేస్తున్న అత్యాచారాలూ! ఏసిడ్ పోతలు! ఎప్పటికీ వీటి అంతం? ఒక్కసారి ప్రళయం సృజించి వీళ్ళందర్నీ కలిపేసుకో!**

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

---

(5వ పేజీ తరువాయి) అటు తరువాత 'తానా' సమావేశాల్లో కలుసుకోవడం, తాను పోలవరపు తులసీదేవినని చెప్పడం, నేను క్రమం తప్పకుండా ప్రముఖాంధ్రను పంపించడంతో తులసీదేవి మాతృహృదయం స్పందిస్తూ అసిధారావ్రతంగా వాత్సల్యధారలు వర్షిస్తూ హర్షం వర్షవర్షమూ పెంపు చేసింది; ఇప్పటికీ అది బ్రహ్మపుత్రనదిలా ఇరుతీరాలను చెరిపివేసింది.

పెద్దలు పెట్టిన పేరులను సార్థకం చేసేవారుంటారు. అందుకే ఈ జగతి కొంతవరకైనా ప్రగతిబాటను నడుస్తున్నది. సునామిలు వచ్చి భూమి ముంపుకు గురియవుతున్నప్పటికినీ భూదేవి క్షమదమాదులను కలిగి ఉంటుందంటే తులసీ దళములవంటి తులసీదేవిలే కారణం.

**దేశమంటే మట్టికాదోయ్**
**దేశమంటే మనుష్యులోయ్** – అన్న గురజాడవారే!
**వట్టిమాటలు కట్టిపెట్టోయ్**
**గట్టిమేలు తలపెట్టవోయ్**– అనే చిరుచురకను కూడా వేసారు.
**దేశమనియెడు దొడ్డ వృక్షం**
**ప్రేమలను పూలెత్తవలెనోయ్**–అన్నారంటే ఆ ప్రేమది నిస్వార్థ సేవే. ఆ స్వార్థరహితమైన సేవాగుణాన్ని తులసీదేవి వద్దనే చూడవచ్చు.


మాతా శిశు సంరక్షణా ధ్యేయంగల తులసీదేవిమదిలో లో ప్రబల రాక్షసిగా విశృంఖల విహారం చేస్తున్న కాన్సర్ చికిత్సపై ఓ దశాబ్దం క్రితమే దృష్టిపడింది. మాతృదేశం నుంచే ఈ చికిత్సకు మార్గనిర్దేశనం చేయాలనే దృష్టి ఎన్టీరామారావు సతీమణి బసవరామతారకం వ్యాధిగ్రస్తగా మరణించినపుడే ఏర్పడిందేమో! అక్కడే ఈ ఆధునిక చికిత్సాలయం నెలకొల్పాలంటే ధనికవనరులు, చికిత్సా యంత్రపరికరాలు అమెరికా నుంచే రావాలి.

భారతదేశంలో ఏటా 8 లక్షల మంది కాన్సర్ రుగ్మతకు గురియవుతుండగా పదోవంతుమంది ఆంధ్రప్రదేశ్ నుంచే ఈ భయంకర వ్యాధి బారిని పడుతున్నారు. హైదరబాదులో 50 పడకలతో ప్రారంభింపబడిన బసవరామతారకం ఆసుపత్రిని ఆంధ్రప్రదేశ్‌లో విస్తరింప చేయాలని ట్రస్టు చేర్మన్‌గా ఉన్న నందమూరి వంశ ప్రవర్థకుడు బాలకృష్ణ తలంచియున్నాడు. తొలి పదేళ్లూ అమెరికా సంఘం వారు వార్షికచందాలు అందించారు. ఇటీవల అవసరాలకు పదహారున్నర కోట్లకుపైగా ఆర్థికంగా సహకరించడంతో డా॥ తులసీదేవి అనన్య కృషి ఉన్నది. ఆసుపత్రి అభివృద్ధిపనట్ల ఆమె ఎంతో ఆశాభావంతో ఉన్నట్లు 'ఈనాడు' పత్రిక (జూలై1 జయవారం)లో చదివాను. పది ఎకరాల విస్తీర్ణతగల స్థలంలో (30 కోట్లు భవన నిర్మాణం కావచ్చునేమో) ఆసుపత్రిని నిర్మిస్తే 40 కోట్ల రూపాయల విలువైన ఆధునిక చికిత్సా సామగ్రి అవసరమై ఉండవచ్చు. అమెరికా వైద్యుల తరఫున మా వంతు సహకారం చేస్తూంటామని తులసీదేవి అన్నట్టు విన్నాను. 'తులసి' అంటే పవిత్రమైనది. తులసీదేవి మాటకూడ అంత పవిత్రమైనది. న్యూయార్కులోని బ్రూక్లిన్ ఆసుపత్రిలో ఆమె గైనకాలజిస్టుగా పనిచేస్తున్నారు.

హైదరాబాదులోని బసవ రామతారకం ఆసుపత్రి వార్షికోత్సవంలో పాల్గొనడానికి వచ్చినప్పుడో పత్రికా విలేఖరికిచ్చిన ఆమె గోష్ఠి సారాంశంలోని కొన్ని విషయాలను మాత్రమే గోప్యంగా వివరిస్తున్నాను.

(ఈ వ్యాసాన్నిప్పుడు ప్రచురించడానికో కారణం ఉన్నది. ఆమె ప్రచారానికి విముఖత చూపే వ్యక్తి. అడిగితే ఫోటోను కూడా యివ్వరు. 'ఈనాడు'లో తులసీదేవి ఫోటో చూడడంతోనే నా కలం కాగితాన్ని ఆశ్రయించింది. గతంలో కూడా 'తులసమ్మ అమ్మ వంటి అమృతహృదయ ఇలలో లేదోయి అని వ్రాసిన గుర్తు, గాకపోయినా ఎప్పుడూ పోలవరపు తులసీదేవి నా కన్నాపిన్న అయినా– 'అమ్మ' స్థానమే. ఉచితంగా 'ప్రముఖాంధ్ర'ను పొందడం సముచితంకాదని భావించే కొద్దిమంది అమెరికా పఠితల్లో తులసీదేవి తలమానిక. చికాగో నుండి చెరుకూరి రమాదేవీ, రమణీయ రమణీ కూడా ఈ జాబితాలోకే వస్తారు. ●

# లంబాడీ తండా నుంచీ లండను దాకా వెళ్ళినా, ప్రొఫెసర్ భంగ్యా భూక్యాను దేశాభిమానమే జన్మభూమికి తెచ్చింది!!



**అడుగడుగునా పడదోసే పాము పడగలే ఉన్ననూ మునుముందుకే సాగిపోయిన భంగ్యా భూక్యా లాంబాడీ తండాలో జన్మించి తిండికోసం విలవిల్లాడే స్థితి నుంచి ఇంటర్నేషనల్ ఫెలోషిప్‌తో, లండన్‌లోని పిహెచ్‌డి చేసే దాకా ఆయన జీవితం ఒక అగ్ని సరస్సు. నిజాం పాలనలో లంబాడీల జీవితాలపై ఆయన సమర్పించిన సిద్ధాంత గ్రంథం 'సబ్బుగేటెడ్ నోమాడ్స్' ఎన్నో యూనివర్శిటీల సిలబస్‌లో విధిగా చదవాల్సిన పుస్తకమయ్యింది. తెలుగుతో సహా పలు భాషల్లోకి అనువాదమయ్యింది. ప్రస్తుతం 'ద ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ'లోని సోషల్ ఎక్స్‌క్లూషన్ స్టడీస్ విభాగపు అధిపతిగా ఉన్న ప్రొఫెసర్ భంగ్యా భూక్యా జీవితంలోని కొన్ని సంఘటలను ఆయన భాష్యంలోనే నివేదించాను!**

'భంగ్యా భూక్యా' పేరును చూసి టిబెట్టువాడో నేపాల్‌వాడో అనుకోకండి! అచ్చతెలుగువాడు. లంబాడీ తెలుగువాడు. ఖమ్మం జిల్లాలోని బండిమీది తండా వూరువాడు. ఓ పదిగొర్రెలు ఐదారు పశువులూ వారి ఆస్తి. ఊరి ప్రక్కనున్న కుంటలో వాటిని మేపుతూ జీవనం సాగించేవారు. అయితేవారి తండా నుంచీ ఓ ముగ్గురు పాఠశాలకు వెళ్లేవారు. అప్పుడు పాఠశాలలో పిల్లలకు ఉప్మా పెట్టేవారు. వాళ్లు కొంత తిని, ఇంటికి కొంత తెచ్చేవారు. నేను పెట్టమని అడిగితే పెట్టేవారు కాదు. వాళ్ళు పెట్టేదేంవిటి బోడిది! నేనే బడికి వెళ్లి ఉప్మా తింటానని కోపంతో – ఉప్మా కోసమే బడిలో చేరాను. ఆ ఉప్మా కోసమే బడిలో చేరిన నాకు విద్యపై ఆసక్తి పెరిగింది. మా ప్రాంతంలో మార్క్సిస్టుపార్టీ రాజకీయ బలంగా ఉండేది. నాలుగవ తరగతి దాకా మా ప్రక్క గ్రామంలో జరిగిన చదువు, తరువాత 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుబ్బేడు గిరిజన సంక్షేమ హాస్టలులో అవకాశం దొరకడంతో చేరిపోయాను. పాపం భూక్యాకు అక్కణ్ణుంచే కష్టాలు ప్రారంభమయ్యాయి. ఆ హాస్టలు అంటే ఒకటే హాలున్నది. 120 మంది బాలురం ఇరుకుగా కాలక్షేపం చేసాం. దానికితోడు, ఆ హాస్టలులో కిలో రెండు రూపాయలతో అన్నం వండినా తెల్ల తెల్లటి పురుగులుండేవి. ఆ అన్నంలోకి చారు తప్ప మరేదీ ఉండేదికాదు. ఆ చారు అన్నంలో తెల్లగా ఉండే పురుగుల నేరి తినేవాళ్లం. దాదాపు అందరికీ గజ్జి కురుపులు వేసేవి. ఆ పాఠశాలలో సుబ్బారెడ్డి టీచర్‌గా పనిచేసేవాడు. ఆయన మమ్మల్ని కులంపేరుతో తిట్టేవాడు. ఎనిమిదవ తరగతిలో ఆయన ఫస్టు పీరియడ్‌కు వచ్చేవాడు. చిన్న కారణానికి కూడా కర్ర తీసుకుని కొట్టేవాడు. ఆ దెబ్బలకు తాళలేక తరగతిగదిలో తప్పించుకు పారిపోయే వాణ్ణి, కర్రవిరిగే వరకూ కొట్టేవాడు! ఆ కర్ర విరిగితే మరో కర్ర– అలా నాలుగు కర్రలు నాపై దెబ్బలకు విరిగేయ్. దానికి ముందే ఆలస్యంగా స్కూలుకు వచ్చానని 'అరే ఓ లంబాడీ... కొడకా అని విరుచుకుపడడం, కర్రతో కొట్టడంతో చచ్చిపోతాననే అనుకున్నాను. స్కూలు మానేద్దామని కూడా అనుకున్నాను. ఆ విషయం హాస్టలు వార్డెన్‌కు చెప్పాను. హాస్టలులో పనిచేసేవా పనివాళ్లు స్కూలు మానొద్దని ప్రేమగా చూచేవారు. వారి లాలనా మాటలతో గుండె దిట్టచేసుకుని చదివాను. ఒళ్ళంతా హూనమైన దెబ్బలు ఈనాటికీ జ్ఞాపకాలుగా నిలిచాయ్. అలా క్రుంగతీసిన గాయాల్ని నిచ్చెనగా చేసుకుని పైపైకి మాలాంటి వాళ్లు పోవాలేమో అనుకున్నాను. ఇలా భరించే గల శక్తి పేదవానికుంటే పైకి రాగలడేమో!

సామాజిక విషయాల మీద నా దృష్టిపడినందున, మంచి మార్కులతో ఉత్తీర్ణుడనైనందును సామాజిక శాస్త్రం చదవాలనే అభిలాష కలిగింది. ఖమ్మంలోని సిద్ధారెడ్డి కాలేజీలో ఇంటర్ హెచ్.ఇ.సి. గ్రూపులో చేరినదాదిగా రెండేళ్ళు జీవితం చాలా కీలకమైనది. మా ఊరికి ఖమ్మం 30 కి. మీటర్లు. ఒకే ఒక బస్సు వెళ్ళేది. అలా వెళ్లి కాలహరణ చేయడం కన్నా ఖమ్మంలో ఉండడం మెరుగనిపించింది. ముగ్గురం విద్యార్థులం కలిసి ఒక్క గదిలో ఉండి చదువుకొనేవాళ్లం. అలా ఉన్నా ఒక్కొక్కరికి నెలకు 100 రూపాయలు ఖర్చయ్యేది. మా కాలేజీ లెక్చరర్లు పునాటి వెంకటేశ్వరరావు సీతారాం గారు వేము ఆర్థిక యిబ్బందుల్లో ఉన్నామని గ్రహించారు. మా గదికి వచ్చి మా పరిస్థితుల్ని గ్రహించారు. ఆర్థిక సహాయం చేస్తామని నైతికంగా

(తరువాయి 8వ పేజీలో)

## వచ్చిన దారిని మర్చిపోతామా?

**పి. హెచ్‌డి కోసం నేను లండన్ వెళ్లాను. అక్కడే ఉద్యోగం వచ్చే అవకాశాలున్నాయి, చేస్తావా అని మా గైడ్ అడిగారు. నేను నా దేశానికి తిరిగి వెళ్లిపోవాలనుకుంటున్నట్లు చెప్పాను. నా శక్తిమేరకు మా గిరిజనులకు ఏదైనా చెయ్యాలనుకుంటున్నాను. అందుకే ఏం చేసినా ఇండియాలోనే చేస్తానని చెప్పాను. ఆయన ఎంతో సంతోషించారు. ఎంత ఎత్తున ఎదిగినా దాటి వచ్చిన లోయల్ని భూమినిమరిచిపోకూడదనుకుంటాను. ఈనాటికీ అడుగడుగునా ఎన్నో అవమానాల్ని ఎదుర్కొంటూ దుర్భరమైన జీవితం గడుపుతున్నవారికి ఆసరా అందించడం కన్నా గొప్ప పని ఏముంటుంది? నా కృషి వెనుక ఒక ఉన్నత స్థానాన్ని అందు కోవాలన్న ఆశ కన్నా, లంబాడీలకు ఎదురవుతున్న అవమానాలకు అడ్డుకట్ట వేయాలన్న కసి ఉంది. పాజిటివ్ కసి సమాజానికి మంచే చేస్తుందన్న సత్యాన్ని నా జీవితమే నాకు నేర్పింది. అంటున్న భూక్యాలో ఎంత అంతర్మథనం ఉందో!**